Disclaimer: we collected these articles from Internet part of Social Awareness Campaign, we are thankful to the creators. We use for non-profit, free education purpose only. To know more, please visit: www.freegurukul.org

# నవోదయ తరహాలో ఏకలవ్య విద్యాలయాలు

జాతీయ స్థాయిలో సొసైటీ

అనుబంధంగా రాష్ట్రంలోనూ ప్రత్యేక ఏర్పాటు

ఈనాడు, హైదరాబాద్: గిరిజన, ఆదివాసీలకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఏర్పాటు చేసిన ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలల్ని నవోదయ విద్యాలయాల తరహాలో తీర్చిదిద్దాలని కేంద్రం భావిస్తోంది. రాష్ట్రాల్లోని ఈ గురుకులాల కోసం జాతీయ స్థాయిలో ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేయనుంది. తెలంగాణకు 2019-20 ఏడాదికి కొత్తగా ఐదింటిని మంజూరు చేయడంతో రాష్ట్రంలో ఏకలవ్య గురుకులాల సంఖ్య 16కు చేరింది. తెలంగాణలో వీటిని తెలంగాణ గిరిజన గురుకులాల సొసైటీ నిర్వహిస్తోంది. తెలుగు రాష్ట్రాల్లో మినహా మిగతా చోట్ల వీటి నిర్వహణ సరిగా లేదని కేంద్ర గిరిజన శాఖ అభిప్రాయపడుతోంది. పలు రాష్ట్రాల్లో గిరిజన సంక్షేమశాఖ ఇచ్చిన నిధులను ఇతరత్రా అవసరాలకు మళ్లిస్తూ, సకాలంలో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు సమకూర్చడం లేదని వెల్లడైంది. భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేసి ఐదేళ్లు గడిచినా పూర్తిచేయడం లేదని అసంతృప్తితో ఉంది. ఇంగ్లిష్ మీడియంలో చదువులు చెప్పించాలని సూచిస్తే, మాతృభాషలో బోధిస్తున్నాయని విమర్శించింది. ఈ నేపథ్యంలో అన్ని రాష్ట్రాల్లోని ఏకలవ్య గురుకులాల నిర్వహణను పూర్తిగా తమ పరిధిలోకి తీసుకోవాలని కేంద్ర గిరిజన సంక్షేమశాఖ నిర్ణయించింది. జాతీయ స్థాయిలో ప్రత్యేక సొసైటీని ఏర్పాటు చేసి నియామకాల నుంచి నిధుల మంజూరు బాధ్యతల వరకు అన్నీ అప్పగించనుంది. ఈ మేరకు రాష్ట్రాల్లోనూ ప్రత్యేక సొసైటీలు ఏర్పాటు చేయాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. జూన్‌లోగా ఈ సొసైటీలు ఏర్పాటు చేస్తే విద్యా సంవత్సరానికి ఇబ్బంది లేకుండా నిధులు ఇస్తామని స్పష్టం చేసింది. తెలంగాణలో ప్రస్తుత గిరిజన గురుకులాల సొసైటీ ఆధ్వర్యంలో కొనసాగించాలా లేదా ప్రత్యేకంగా నిర్వహించాలా అనే విషయమై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం నుంచి స్పష్టత తీసుకోనుంది.

## ప్రత్యేక సొసైటీ ఏర్పాటైతే...

* కేంద్రం నుంచి ఈ గురుకులాల కోసం వచ్చే నిధులన్నీ నేరుగా పాఠశాలలకు వెళ్తాయి.

* ప్రభుత్వ జోక్యం లేకుండా ప్రిన్సిపల్ సొంతగా పనులు చేసేందుకు వీలు కలుగుతుంది.

* ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర పోస్టులను కేంద్ర సొసైటీ నేరుగా భర్తీ చేస్తుంది. వేతనాలు కేంద్ర సొసైటీ స్కేళ్ల ప్రకారం ఉంటాయి.

* సీబీఎస్ఈ సిలబస్ అమలు చేస్తారు.

* భవన నిర్మాణ పనులను కేంద్ర ప్రజాపనుల విభాగం, జాతీయ భవనాల నిర్మాణ సంస్థ చేపడుతుంది.

Disclaimer: we collected these articles from Internet part of Social Awareness Campaign, we are thankful to the creators. We use for non-profit, free education purpose only. To know more, please visit: www.freegurukul.org